ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
7
పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
గురువారం 15 ఆగస్టు 2024



సర్వం సిద్ధం

పంద్రాగస్టు వేడుకలకు

- జెండా పండగకు ముస్తాబైన మన్యం
- ఘనంగా నిర్వహించేందుకు జిల్లావాసులు సన్నద్ధం
- పార్వతీపురంలో ఏర్పాట్లు పూర్తి.. జెండా ఆవిష్కరించనున్న మంత్రి
- పరిశీలించిన కలెక్టర్
- 355 మందికి అవార్డులు



మాక్‌డ్రిల్ చేస్తున్న పోలీసులు

పార్వతీపురం, ఆగస్టు14 (ఆంధ్రజ్యోతి): పంద్రాగస్టు వేడుకలకు జిల్లా సిద్ధమైంది. స్వాతంత్ర్య దినోత్సవాన్ని వాడవాడలా ఘనంగా నిర్వహించేందుకు జిల్లావాసులు సర్వం సిద్ధం చేశారు. విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో వేడుకల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. బుధవారం పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. సాయంత్రం కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అక్కడకు చేరుకుని ఏర్పాట్లను పరిశీలించారు. వేదిక , అతిథులు కూర్చొనే గ్యాలరీలు, వివిధ శాఖలు ఏర్పాటు చేసే ప్రదర్శన శాలలు, మైదానంలో ఇతర ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పోలీసులు మాక్‌డ్రిల్ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాకేంద్రంలో నిర్వహించే స్వాతంత్ర్య వేడుకలకు మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని తెలిపారు. గురువారం ఉదయం 9 గంటలకు జాతీయ జెండా ఎగురవేస్తారని చెప్పారు. పోలీసుల పరేడ్, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రదర్శనలు, వివిధ శాఖల శకటాలను తిలకించనున్నారని వెల్లడించారు. అనంతరం 355 మంది ఉత్తమ అధికారులు, ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందిస్తారని స్పష్టం చేశారు. ఎక్కడా ఎటువంటి సమస్య తలెత్తరాదని, వేడుకలకు హాజరయ్యే వారికి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆయన ఆదేశించారు. ఈ పరిశీలనలో జాయింట్ కలెక్టర్ శోభిక, ఏఎస్పీ దిలీప్‌కిరణ్, ఆర్డీవో కె.హేమలత, డీఆర్‌డీఏ, డ్వామా పీడీలు వై.సత్యంనాయుడు, కె.రామచంద్ర రావు తదితరులు పాల్గొన్నారు.


పోలీసుల మాక్‌డ్రిల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, జేసీ, ఏఎస్పీ

ప్రతి ఇంటిపైనా జెండా ఎగరాలి..

ఆజాదికా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ పిలుపునిచ్చారు. జాతీయ సమైక్యతను చాటిచెప్పేలా ప్రతి ఒక్కరు ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని సూచించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో సమీక్షించారు. అన్ని పాఠశాలల్లో పిల్లలతో ప్రతిజ్ఞ చేయించి.. జాతీయ జెండాతో ర్యాలీలు నిర్వహించాలని, ఆయా ఫొటోలను హర్‌ఘర్ తిరంగా వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ప్రతి పంచాయతీ స్థాయిలో జాతీయ సమైక్యతపై పోటీలు నిర్వహించాలని, డ్వాక్రా మహిళలతో కూడా పెద్ద ఎత్తున గ్రామాల్లో ర్యాలీలు చేపట్టాలని తెలిపారు.. మండల ప్రధాన కేంద్రాల్లో, అన్ని కళాశాలల్లో సెల్ఫీ పాయింట్లను ఏర్పాటు చేసి ప్రతి ఒక్కరు సెల్ఫీ దిగి ఫొటోను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. మున్సిపాలిటీలు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్ తదితర కూడళ్లలో సెల్ఫీపాయింట్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

ఐటీడీఏల్లో..

- సీతంపేట ఐటీడీఏలో ఏపీవో చిన్నబాబు, గిరిజన సంక్షేమ శాఖ డీడీ అన్నదొర, ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో పంద్రాగస్టు వేడుకలు నిర్వహించనున్నారు. కాగా పీవో రాహుల్‌కుమార్ రెడ్డి బదిలీ అయిన నేపథ్యంలో అవార్డులకు ఎవరినీ ఎంపిక చేయలేదని ఏపీవో తెలిపారు. జేసీ శోభికను ఐటీడీఏ ఇన్‌చార్జి పీవోగా నియమించినట్లు ఆయన చెప్పారు.
- పార్వతీపురం ఐటీడీఏలో ఇన్‌చార్జి పీవో, జేసీ శోభిక జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. ఐటీడీఏ పరిధిలో ఉత్తమ ఉద్యోగులు, అధికారులకు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో కలెక్టర్ చేతుల మీదుగా అవార్డులు, ప్రశంసా పత్రాలు అందించనున్నారు.

స్వాతంత్ర్య ప్రకటన రేడియోలో విన్నా..



స్వాతంత్ర్య ఉద్యమం.. నాటి భావోద్వేగాలను సాలూరు పట్టణానికి చెందిన సీనియర్ సిటిజన్.. 88 ఏళ్ల **లావేటి సన్యాసిరావు** బుధవారం నెమర వేసుకున్నారు. నేరుగా స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనకపోయి నప్పటికీ నాటి అనుభవాలు, తీపిగురుతులను వెల్లడించారు. స్వాతంత్ర్యం ప్రకటించినప్పటి గడియల్లోకి ఒకసారి వెళ్లి అప్పటి సంఘటనలను కళ్లకు కట్టారు. ఆయన ఏమన్నారంటే.. 'ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న స్వాతంత్ర్య ప్రకటన రేడియోలో విన్నాం. అప్పటికి నా వయసు 11 సంవత్సరాలు అనుకుంటా. చిన్నవాడినైనా.. నాటి హడావుడి ఇంకా జ్ఞాపకం ఉంది. బ్రిటిష్ వారు దేశం విడిచి వెళ్లిపోయారని, మనకు స్వేచ్ఛ వచ్చిందని తెలియగానే ప్రజలంతా ఆనందంతో కేరింతలు కొట్టారు. భారతమాతకు జైజై అనే నినాదం అంతటా మిన్నంటింది. నాడు స్వాతంత్ర సమరయోధుడు కూనిశెట్టి వెంకట నారాయణ దొర పిలుపునందుకొని వీధుల్లో జనం ఊరేగింపు చేశారు. మిఠాయి పంచి, మతాబులు పేల్చారు. తెల్లదొరలు (బ్రిటిష్ వారు) వెళ్లిపోతున్నారనే ఆనందంతో సెంటర్‌లో నేషనల్ కేఫ్ (2001 వరకు ఉండేది) యాజమాని ఎస్ఎస్ రామారావు బాణసంచా కాల్చారు. వాటిని చూడడానికి నేనూ అక్కడకు వెళ్లాను' అని తెలిపారు.

-సాలూరు రూరల్



అన్న క్యాంటీన్‌కు భూమి పూజ

సాలూరులో అన్న క్యాంటీన్ భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. బుధవారం స్త్రీ, శిశు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి భూమి పూజ చేశారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.60 లక్షలతో భవన నిర్మాణం చేపట్టనున్నట్లు ఆమె తెలిపారు.

-సాలూరు

నిబంధనలు పాటించాల్సిందే..

- జిల్లా రవాణాశాఖాధికారి శశికుమార్

పార్వతీపురం టౌన్, ఆగస్టు 14 : జిల్లాలో ప్రైవేట్ పాఠశాలల బస్సులు, ఆటోలకు చెందిన యజమానులు, డ్రైవర్లు నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తప్పవని జిల్లా రవాణా శాఖాధికారి ఎం.శశికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల ప్రైవేట్ పాఠశాలల బస్సులు, ఆటోలు ప్రమాదాలకు గురవుతున్న నేపథ్యంలో ఎవరూ నిర్లక్ష్యంగా వ్యవహరించ రాదన్నారు. వాహనాల సామర్థ్యాన్ని రోజూ పరిశీలించాలని సూచించారు. డ్రైవర్లు మద్యం తాగి, ఫోన్‌లో మాట్లాడుతూ వాహనం నడపరాదన్నారు. ప్రథమ చికిత్స బాక్సు తప్పనిసరిగా ఉంచాలని, వాహనాల్లో పరిమితికి మించి విద్యార్థులను తీసుకెళ్లరాదని తెలిపారు.

12 గంటలు.. అలానే..

- రోడ్డుపై గోతిలో దిగబడిన లారీ
- వాహనాల రాకపోకలకు అవస్థలు



ఇది భామిని మండలం సింగిడి సమీపంలో రోడ్డు. బుధవారం ఒడిశా నుంచి విశాఖ వెళ్తున్న ఇసుక లారీ ఆ మార్గంలోని గోతిలో ఇలా దిగబడింది. రోడ్డు మధ్యనే లారీ నిలిచిపోవడంతో వాహనాల రాక పోకలకు ఇబ్బందులు తప్పలేదు. ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు వాహనదారులు నానా అవస్థలు పడ్డారు. ఆ తర్వాత స్థానిక లారీ కార్మికులు ఎక్స్‌కవేటర్ సాయంత్రంలో గోతిలో పడిన వాహనాన్ని బయటకు తీశారు. దీంతో యథావిధిగా వాహన రాకపోకలు సాగాయి. వాస్తవంగా బిల్లుమడ నుంచి సింగిడి వరకు రోడ్డుపై భారీగా గుంతలు ఏర్పడ్డాయి. ఉదయాన్నే కురిసిన వర్షానికి వాటిల్లో నీరు చేరింది. దీంతో ఈ మార్గం చెరువును తలపించింది. రోడ్డు ఎక్కడుందో వెతుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడంది. గత ప్రభుత్వ హయాంలో కొంతవరకు రోడ్డు పనులు జరిగినా.. సకాలంలో బిల్లులు చెల్లించలేదు. దీంతో కాంట్రాక్టర్లు చేతులెత్తేశారు. పనులను మధ్యలోనే నిలిపివేశారు. కాగా ఇటీవల కురిసిన వర్షాలకు ఈ రోడ్డు మరింత అధ్వానంగా మారింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

- భామిని

గజరాజుల హల్‌చల్

- జనావాసాల్లో సంచారం
- భయాందోళనలో గిరిజనులు


కురుపాం రూరల్: కురుపాం మండలం జరడ పంచాయతీ పరిధి గెడ్డగూడ గ్రామంలో గజరాజులు హల్‌చల్ చేస్తున్నాయి. అవి తరచూ జనావాసాల్లోకి వస్తుండడంతో గిరిజనులు హడలెత్తిపోతున్నారు. మంగళ వారం రాత్రి గెడ్డగూడలో ఓ పూరిల్లును అవి ధ్వంసం చేశాయి. ధాన్యం, బియ్యం, బబ్బుర్లు, జొన్నలు, గంటెలు వంటి చిరుధాన్యాలను నాశనం చేశాయి. దీంతో గ్రామస్థులు తీవ్ర భయాందోళన చెందారు. పంచాయతీ పరిధిలోని తొమ్మిది గ్రామాల్లో సంచరిస్తున్న నాలుగు గజరాజులను తక్ష ణమే ఈ ప్రాంతం నుంచి తరలించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. కాగా బుధవారం ఏనుగులు జరడలో సంచరించాయి. దీంతో ఆయా ప్రాంతవాసులు బెంబేలెత్తిపోతున్నారు. ఇప్పటికే ఏనుగులు జంపరకోట, పటాయిగెడ్డ, గెడ్డగూడ, మూలిగూడ, ఈతమానుగూడ, పొడిదుం గ్రామా ల్లో పంటలు నాశనం చేశాయి. అధికారులు సిబ్బంది పరిశీలించి పరిహారం ఇప్పించాలని గిరిజన రైతులు కోరుతున్నారు.


జరడ పంచాయతీలో సంచరిస్తున్న ఏనుగుల గుంపు

ఉత్తర్వులు రాకముందే..

బదిలీల సమాచారంతో ఉద్యోగుల్లో మొదలైన హడావుడి

- ఎమ్మెల్యేలు, కూటమి శ్రేణుల చుట్టూ ప్రదక్షిణలు
- అనుకూల స్థానాల కోసం పైరవీలు
- సిఫారసు లేఖల కోసం ప్రయత్నాలు



పార్వతీపురం, ఆగస్టు14(ఆంధ్రజ్యోతి): ప్రజలతో నేరుగా సంబంధం ఉండే శాఖల్లో ఉద్యోగుల సాధారణ బదిలీలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వనుంది. వీటికి సంబంధించిన మార్గదర్శకాలు నేడో రేపో వెలువడే అవకాశం ఉంది. నిబంధల‌న ప్రకారం ఐదేళ్లపాటు ఒకే చోట ఉద్యోగం చేస్తున్నవారిని తప్పనిసరిగా బదిలీ చేస్తారు. మిగిలిన వారికి పరిపాలనాపరమైన అవసరాల మేరకు స్థానచలనం కల్పించను న్నారు. అయితే దీనికి సంబంధించిన జీవో రాకముందే జిల్లాలో కొంత మంది ఉద్యోగులు అనుకూల స్థానాల కోసం పైరవీలు ప్రారంభించారు. సిఫారసు లేఖల కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. మరికొందరు కూటమి ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. గత ఐదేళ్లు.. వైసీపీ ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరించిన కొందరు అధికా రులు తాజాగా ద్వితీయ శ్రేణి టీడీపీ నాయకులను ఆశ్రయిస్తున్నారు. తాము కోరిన స్థానాలకు బదిలీ చేయాలని కోరుతున్నారు. మొత్తంగా జిల్లాలో బదిలీల ప్రక్రియ ఏ విధంగా సాగుతుందో.. ఎమ్మెల్యేలు ఎవరికి సిఫారసు చేస్తారోనన్న వ్యాఖ్యలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

దశాబ్దకాలంగా ఒకే స్థానంలో..

జిల్లాలోని ఒక పురపాలక సంఘంలో ఇంజనీరింగ్ అధికారి సుమారు దశాబ్ద కాలంగా ఒకే చోట పనిచేస్తున్నారు. బదిలీ జరిగినా.. ఏదో ఒక కారణంతో వెనక్కి రావడం, ఆ పుర పాలక సంఘంలో పనిచేసుకో వడం ఆయనకు అలవాటుగా మారింది. ఇటువంటి అధికారులను కొనసాగిస్తారా? లేకుంటే స్థానచలనం కల్పిస్తారా? అన్నది వేచి చూడాల్సి ఉంది. ఇదిలా ఉండగా జిల్లాలోని కొన్ని ఇంజనీరింగ్ శాఖల్లో పనిచేస్తున్న అధికారులు తమ పరిధిలోనే పనిచేసేందుకు ఆసక్తి చూపిస్తున్నట్లు తెలిసింది. ఇటువంటి వారిని జిల్లాకు దూరంగా ఉంచుతారో.. లేదో..! అన్నది కొద్ది రోజుల్లో తేలనుంది.

సిఫారసు లేఖలు

కొన్నిశాఖల్లో అధికారులు, ఇంజనీరింగ్ సిబ్బంది.. తమకు కావాల్సిన స్థానాల కోసం ప్రజా ప్రతినిధుల నుంచి ఇప్పటికే సిఫారసు లేఖలు సంపాదించినట్లు సమాచారం. వాటితో పాటు తమ పలుకుబడిని ఉపయోగించి వారికి అనుకూలమైన స్థానాల్లో పోస్టింగ్ పొందేందుకు జోరుగా పైరవీలు సాగిస్తున్నట్లు తెలిసింది.

ఇది వాస్తవం కాదా..?

గతంలో జగనన్న కాలనీలకు భూసేకరణకు సంబంధించి పార్వతీపురం, పాలకొండ, సాలూరు నియోజకవర్గాల్లో కొంతమంది తహసీల్దార్లు వైసీపీ నాయకులకు అనుకూలంగా వ్యవహరించారు. భూముల కొనుగోలు విషయంలో వారితో కుమ్మక్కై ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి కొట్టారనే విమర్శలున్నాయి. అంతేకాదు ఒక నియోజకవర్గానికి చెందిన ఎమ్మెల్యేకు కొంతమంది తహసీల్దార్లు బినామీలుగా వ్యవహరించారన్న ఆరోపణలున్నాయి. అటువంటి తహసీల్దార్లను ఇప్పుడు ఏం చేస్తారన్నది చర్చనీయాంశమవుతోంది. వారిని జిల్లా నుంచి పంపిస్తారా? లేకుంటే ప్రాధాన్యం లేని స్థానాల్లో పోస్టింగ్ ఇస్తారా? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ప్రస్తుతం నాలుగు నియోజకవర్గాల్లో ఏ ఇద్దరు కలిసినా.. దీనిపైనే మాట్లాడు కుంటున్నారు. ఇదిలా ఉండగా గత ఐదేళ్లు.. అవినీతి, అక్రమాలకు పాల్పడిన కొంతమంది అధికారులు జిల్లాలోనే తిరుగుతూ.. పోస్టింగ్‌లు సంపాదించేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అయితే ఇటువంటి వారిని దూరం పెట్టాలని జిల్లావాసులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

సీతంపేట ఐటీడీఏలో..



సీతంపేట: సీతంపేట ఐటీడీఏ పరిధిలోని వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు బదిలీలు ఈ నెలాఖరకు పూర్తి చేయాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఏజెన్సీ ప్రాంతంలో రెండేళ్ల సర్వీసు పూర్తయిన వారు కూడా బదిలీలకు అర్హులని స్పష్టం చేసింది. దీంతో ఇక్కడున్న వారు మైదాన ప్రాంతాలు, ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లడానికి ఆసక్తి చూపుతున్నారు. బదిలీలకు సంబంధించి తమకు అనుకూలమైన ప్రాంతాలను ఎంచుకొనే పనిలో కొందరు అధికారులు నిమగ్న మయ్యారు. సచివాలయం, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఉద్యాన, వ్యవసాయశాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులు బదిలీపై వెళ్లడానికి సన్నద్ధమవుతున్నారు. అయితే రెవెన్యూ, విద్యా శాఖకు సంబంధించి బదిలీలు నిలుపుదల చేయడంతో ఈ ప్రాంతంలో పనిచేస్తున్న వారు కొంత నిరాశకు గురయ్యారు.

అప్రమత్తంగా ఉండాలి

ఉద్యోగుల బదిలీల విషయంలో కూటమి నాయకులు, ఎమ్మెల్యేలు అప్రమత్తంగా ఉండా ల్సిన అవసరం ఎంతైనా ఉంది. గత వైసీపీ సర్కారు పాలనలో ఇష్టారాజ్యంగా వ్యవహ రించిన ఉద్యో గులు, అవినీతి, అక్ర మాలకు పాల్పడిన అధికారులను దూరంగా ఉంచాల్సిన అవసరం ఉంది. గతంలో వారి తీరు, ఎదుర్కొన్న సమస్యలను దృష్టి పెట్టుకుని.. దగ్గరకు రానీ యకుండా చేయాలని జిల్లావాసులు కోరుతున్నారు.


రావుపల్లి సమీపంలో నీట మునిగిన వరి పొలాలు

దేసూరిగెడ్డకు వరద

- నీట మునిగిన 150 ఎకరాలు
- చెరువును తలపిస్తున్న వరి పొలాలు
- ఆందోళనలో రైతులు

గరుగుబిల్లి, ఆగస్టు 14 : గరుగుబిల్లి మండలం రావుపల్లి సమీపంలోని దేసూరిగెడ్డకు వరద పోటెత్తింది. ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండడంతో గెడ్డ ఉప్పొంగి ప్రవహిస్తోంది. దీంతో బుధవారం దానికి ఆనుకుని ఉన్న సుమారు 150 ఎకరాల్లో వరి పంట ముంపునకు గురైంది. పొలాలన్నీ చెరువులను తలపించాయి. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. అప్పులు చేసి వరి ఉబాలు పూర్తి చేశామని.. తీరా వరద పోటుకు మొత్తం నీట మునిగిందని సుమారు వందమంది రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాస్తవంగా పెద్దూరుకు ఆనుకుని ఉన్న దక్షిణాది చెరువు, బలిజిపేట మండలం అజ్జాడ, మురగడాం నుంచి దేసూరిగెడ్డ నీరు చేరుతుంది. అయితే ఏటా వర్షాలు కురిసే సమ యంలో మాత్రం గెడ్డకు ఆనుకుని ఉన్న పంటలు ముంపునకు గురవుతున్నాయి. దీనిపై స్పందించాలని గత ఐదేళ్లు అధికారులు, ప్రజాప్రతినిధులను రైతులు కోరినా.. ప్రయోజనం లేకపోయింది. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు దృష్టి సారించి తమను ఆదుకోవాలని ఆ ప్రాంతవాసులు కోరుతున్నారు.

వారి నిర్లక్ష్యమే కారణమా?

గెడ్డ ప్రాంతంలో పూడికలు, పిచ్చిమొక్కలు తొలగించాలని ఉన్నతాధి కారులు ఆదేశించినా ఉపాధి సిబ్బంది పట్టించుకోలేదని రైతులు చెబు తున్నారు. సంబంధిత క్షేత్ర సహాయకుడు , టెక్నికల్ అసిస్టెంట్ సకాలంలో స్పందించి ఉంటే.. ముంపు సమస్య ఉండేది కాదన్నారు. ఉపాధి హామీ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా తమ నష్టం కలుగుతుందన్నారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని వారు తెలిపారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాలకొండ: పాలకొండ ఉప కేంద్రం పరిధిలో విద్యుత్ సరఫరాకు శుక్రవారం అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ టీజీకే మూర్తి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలో 11 కేవీ బూర్జ, సంకిలి లైన్ నిర్వహణ పనులు నిమిత్తం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

ఖాళీల భర్తీ కోసం దరఖాస్తుల ఆహ్వానం

సీతానగరం: మండలంలోని జోగింపేట సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో 88 ఖాళీలు ఉండడంతో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మధు ఒక ప్రకటనలో బుధవారం తెలిపారు. ఐదో తరగతిలో 20 సీట్లు, ఆరో తరగతిలో 18 సీట్లు, ఏడో తరగతిలో ఒకటి, ఎనిమిదో తరగతిలో 14 సీట్లు, తొమ్మిదో తరగతిలో ఆరు సీట్లు, ఇంటర్‌లో 14 సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు కళాశాల కార్యాలయంలో వెంటనే సంప్రదించాలని కోరారు.

భద్రగిరి ప్రభుత్వ ఐటీఐలో..

గుమ్మలక్ష్మీపురం: భద్రగిరి ప్రభుత్వ ఐటీఐలో మిగిలి ఉన్న సీట్ల భర్తీ కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సి.హెచ్.సునీల్‌కుమార్ తెలిపారు. ఫిట్టర్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, మోటార్ మెకానిక్, కోపావెల్డర్, డ్రస్ మేకింగ్ సీట్లకు ఈ నెల 26లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 27న వెరిఫికేషన్, 29న కౌన్సెలింగ్ ఉంటుందన్నారు.

దళితులపై దాడిచేసిన వారిని శిక్షించాలి



దీక్షలకు మద్దతు తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

పార్వతీపురంటౌన్: దళితుల భూములు ఆక్రమించుకోవడమే కాకుండా వారిపై దాడులకు దిగిన వారిని శిక్షించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు పండు, రాజులు డిమాండ్ చేసారు. బుధవారం పార్వతీపురంలోని కలెక్టరేట్ వద్ద తమ భూములు ఆక్రమించుకున్న పెత్తందారుల నుంచి ఇప్పించాలని కోరుతూ గరుగుబిల్లి మండలం శివ్వాం గ్రామానికి చెందిన దళితులు రిలే దీక్షలను చేపట్టారు. ఈ దీక్షకు ఎస్ఎఫ్ఐ మద్దతుఇచ్చింది.

ఉల్లిభద్ర సమీపంలో గోతుల పూడ్చివేత

గరుగుబిల్లి: పార్వతీపురం నుంచి పాలకొండ వైపు వెళ్లే ప్రధానరహదారిలో ఉల్లిభద్ర సమీపంలోని తోటపల్లి కుడి ప్రధాన కాలువకు ఆనుకుని ఉన్న ప్రధాన రహదారి పై బుధవారం గోతులుపూడ్చారు. దీంతో ఈప్రాంతంలో చీకటి పడితే రాకపోకలకు అవస్థలుపడేవారు. ఈ నేపథ్యంలో కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి స్పందించారు. ఆద్యం మైనింగ్ ప్రతినిధులు నాగేశ్వరరావు, సూర్యనారాయణ, చక్రధర్ దృష్టికి రహదారి సమస్యను తీసుకువెళ్లారు. దీంతో కంపెనీ ప్రతినిధులు స్పందించి వాహనాలతో అవసరమైన సామగ్రిని గోతుల్లో వేసి యంత్రాలతో చదును చేయించారు. రహదారి సమస్యను సీఎం దృష్టికి తీసుకువెళ్తానని, నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభమవుతాయని ఎమ్మెల్యే తెలిపారు.

ఎమ్మెల్యేపై ఆరోపణలు తగదు



మాట్లాడుతున్న మధుసూదనరావు

గరుగుబిల్లి: కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరిపై తప్పుడు ప్రకటనలను మానుకోవాలని టీడీపీ మండలాధ్యక్షుడు అక్కేన మధుసూదనరావు, పార్టీ అరకు బీసీ సెల్ ఉపాధ్యక్షుడు, సంతోషపురం సర్పంచ్ అంబటి తవిటినాయుడు కోరారు. బుధవారం నాగూరులో విలేకరులతో మాట్లాడుతూ అభివృద్ధిపై దృష్టి సారిస్తున్న ఎమ్మెల్యేపై ఆరోపణలు చేయడం మంచిది కాదన్నారు.నియోజకవర్గంలో ఒకేవర్గానికి పెదపీట వేస్తున్నా రన్న ఆరోపణల్లో నిజంలేదన్నారు. ఎమ్మె ల్యేనన్న భావన లేకుండా ప్రజలతోనే మమేకమవుతున్న ఆమెపై విష ప్రచారం మానుకోవాలన్నారు. గిరిజన మహిళ అన్న చిన్న చూపు చూడరాదని హితవుపలికారు.

చినుకుపడితే బేజారు

● భామినిలో రోడ్డుపైకి చేరుతున్న మురుగు నీరు



రోడ్డుపై పారుతున్న మురుగునీటిని మళ్లిస్తున్న మహిళలు

భామిని: భామినిలో చినుకుపడితే ప్రజలు బేజారవుతున్నారు. బుధవారం ఉదయం వర్షం కురవడంతో కాలువలో మురుగు రోడ్డుపైకి చేరడంతో గ్రామస్థులు ఇబ్బందులకు గురయ్యారు. ప్రధానంగా నాయుడు వీధి కాలువలో చెత్త ఉండిపోవడంతో నీరు రోడ్డుపైకి పారింది. సమీప ఇళ్లల్లో ఉన్న మహిళలు నీరు మళ్లిం చేందుకు పాట్లుపడ్డారు. ఇప్పటికైనా అధికారులు జోక్యం చేసుకొని కాలువల్లో పూడికతీతలు పనులు చేయాలని పలువురు మహిళలు కోరుతున్నారు.

పంచాయతీల అభివృద్ధికి పాటుపడాలి

● డీఎల్‌పీవో నాగభూషణం

సీతంపేట రూరల్: గ్రామ పంచాయతీల అభివృద్ధికి సర్పంచ్‌లు, కార్యదర్శులు పాటు పడాలని పార్వతీపురం డివిజినల్ పంచాయతీ అధికారి బి.నాగభూషణం అన్నారు. స్థానిక వైటీసీలో జరుగుతున్న శిక్షణ శిబిరాన్ని డీఎల్‌పీవో సందర్శించారు. ఈ శిబిరంలో ఎంపీడీఓ కె.గీతాంజలి, ఈఓపీఆర్‌డీ సత్యం తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి చొరవ చూపాలి: ఈవోపీఆర్డీ



మాట్లాడుతున్న గోపాలరావు

గరుగుబిల్లి: పంచాయతీల అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపి ఆదర్శంగా తీర్చిదిద్దాలని ఈవోపీఆర్‌డీ ఎల్.గోపాలరావు సూచించారు. బుధవారం గరుగుబిల్లిలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు ప్రణాళికల నిర్వహణపై మూడురోజుల శిక్షణ నిర్వహించారు. ముగింపును పురస్కరించుకుని పలుఅంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏవో ఎస్. అర్జునరావు, రిసోర్స్‌పర్సన్లు టి.భాస్కర రావు, అప్పారావుతో పాటు కార్యదర్శులు ఆర్.శశికుమార్, సీహెచ్‌పీ కూర్మినాయుడు, శ్రీనివాసరావు, సాయికుమార్, జగదీష్, లలిత, దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

పాలకొండ: పట్టణంలోని గాయత్రీ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో అగ్నిమాపక అధికారి జామిసర్వేశ్వరరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు అగ్నిప్రమాదాలు, వాటి నివారణపై బుధవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

సాగుచేస్తున్న భూములకు పట్టాలివ్వాలి

● వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యుడు దుర్గారావు

పాలకొండ: సాగుచేస్తున్న భూములకు పట్టాలివ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యుడు దూసి దుర్గారావు డిమాండ్ చేశారు. బుధవారం పాలకొండలో ఈనెల 19న చలో కలెక్టరేట్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో పేదలు, గిరిజనులు కొండ పోరంబోకు భూమి, అటవీ భూమి 25 సంవత్సరాలు నుంచి సాగు చేస్తున్నారని, ఇంతవరకు పట్టాలు ఇవ్వలేదని తెలిపారు. పాలకొండ మండలంలో వివిధ గ్రామాతో పాటు గిరిజన ప్రాంతంలో పేదల భూములు అన్యాక్రాంతమయ్యాయని, వాటిని పేదలకు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్య క్రమంలో రాయవలస లక్ష్మీనారాయణ, భుజంగరావు, సామంతుల మురళి, కూరాకుల లక్ష్మం, జి.సింహాచలం పాల్గొన్నారు.

80 మందికి రక్త పరీక్షలు

భామిని: గురండిలో బుధవారం జనసేన యూత్ ఆధ్వర్యంలో 80 మందికి రక్త పరీక్షలు నిర్వహించినట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ ఆర్. కిరణ్‌కుమార్ తెలిపారు. శ్రీకాకుళం గాయత్రీ హెల్త్ ల్యాబ్ క్యాంప్ కో-ఆర్డినేటర్ హరి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో చిరంజీవి, కిరణ్, జనసేన నాయకులు పాల్గొన్నారు.

రహదారి ఉన్నా.. బస్సు లేదన్నా!

● ఎక్కడికి వెళ్లాలన్నా ఆటోలే గతి
● విద్యార్థులకు మరీ కష్టం



లక్ష్మీనారాయణపురానికి పక్కా రహదారి ఉన్న దృశ్యం

పార్వతీపురం రూరల్: ఏ ఊరికైనా బస్సు నడపాలని ఆర్టీసీ వారిని కోరితే.. సరైన రహదారి లేదని సమాధానమిస్తారు. కానీ రహదారి సౌకర్యం ఉన్న ప్రాంతాలకు రవాణా సౌకర్యం విషయమై పట్టించుకోవడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. మండలంలోని అత్యధిక పంచాయతీలకు పక్కా రహదారులు ఉన్నప్పటికీ దశాబ్దాలుగా రవాణా సదుపాయం లేదు. ప్రభుత్వాలు మారుతున్నాయి.. పాలకులు మారుతున్నారు తప్ప గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సదుపాయం కల్పించేందుకు తీసుకుంటున్న ప్రత్యేక చర్యలు ఏమీ లేవని చెప్పవచ్చు. గోపాలపురం, అడ్డాపుశీల, పెదమరికి, చిన్నమరికి, వీఆర్‌పేట తదితర గ్రామాలకు ఇప్పటికీ బస్సు సౌకర్యం లేదు. పాఠశాలలకు వెళ్లే పిల్లలు ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోంది. దీంతో విద్యార్థులు తిరిగి వచ్చేవరకు తల్లిదండ్రులు బిక్కుబిక్కుమంటూ ఎదురుచూడాల్సి వస్తోంది. కొన్ని ప్రైవేటు పాఠశాలలు సొంతంగా బస్సులు నడుపుతున్నాయి. మరికొన్ని పాఠశాలలకు ఆ సదుపాయం లేకపోవడం..ఉన్నా ఆర్థికంగా భారం కావడంతో తల్లిదండ్రులు ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోంది. తమ గ్రామాలకు బస్సు సదుపాయం కల్పించాలని ప్రజలు ఎన్నిసార్లు వినతులు ఇచ్చినా ఆర్టీసీ యాజమాన్యం పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. దీనిపై టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి గ్రామీణ ప్రాంతాల ప్రజలకు బస్సు సదుపాయం కల్పించాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.



సీతానగరం: ర్యాలీలో పాల్గొన్న రెవెన్యూ, మండల పరిషత్ అధికారులు



గుమ్మలక్ష్మీపురం: ఎమ్మెల్యే జగదీశ్వరికి జాతీయ జెండాను అందిస్తున్న పోస్టల్ సిబ్బంది



పార్వతీపురం రూరల్: పార్వతీపురంలో హర్‌ఘర్ తిరంగా ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే విజయచంద్ర

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి

● జిల్లాలో హర్ ఘర్ తిరంగా ర్యాలీలు

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని వక్తలు పిలుపునిచ్చారు. సీతంపేట, గుమ్మలక్ష్మీపురంలో హర్‌ఘర్ తిరంగా ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వాతంత్రోద్యమానికి కృషి చేసిన మహానుభావులను గుర్తించుకోవాలని పిలుపునిచ్చారు. కాగా హర్‌ఘర్ తిరంగ కార్యక్రమంలో భాగంగా పార్వతీపురం పోస్టల్ డివిజన్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ జీవీ రమణారావు కేంద్ర సాంస్కృతిక శాఖామంత్రి గజేం ద్రసింగ్ శేఖావత్ పంపిన సందేశం లేఖతో పాటు జాతీయ జెండాను కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరికి గుమ్మలక్ష్మీపురంలో అందజేశారు. అలాగే హర్‌ఘర్ తిరంగా కార్య క్రమాలు ఘనంగా నిర్వహించాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పడాల భూదేవి ఒక ప్రకటనలో తెలిపారు.

-ఆంధ్రజ్యోతి బృందం



వీరఘట్టం: ర్యాలీలో ప్రమాణం చేస్తున్న అధికారులు



భామిని: ర్యాలీ నిర్వహిస్తున్న ప్రభుత్వ కళాశాల విద్యార్థులు

ప్రిన్సిపాల్‌పై చర్యలకు రంగం సిద్ధం

పార్వతీపురం-ఆంధ్రజ్యోతి: మక్కువ మండలంలోని ములక్కాయవలస ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాడానికి రంగం సిద్ధంచేశారు. ఇటీవల జరిగిన పాఠశాల ఎస్ఎంసీ ఎన్నికల్లో పసుపు చొక్క వేసుకొని వెళ్లిన టీడీపీ నాయకులకు చొక్కా ఇప్పాలని కోరిన విషయంవిదితమే. ఈ నేపథ్యంలో మంత్రి సంధ్యారాణి ఆదేశాలమేరకు విచారణ నిర్వహించారు.చొక్కాఇప్పిన తర్వాతే ఎన్నికల ప్రకియలో పాల్గొనేందుకు ప్రిన్సిపాల్ తీసుకున్నట్లు చర్యలు వాస్తవమేనని విద్యాశాఖ అధికారుల విచారణలో బహిర్గత మైనట్లు సమాచారం. దీనిపై ప్రిన్సిపాల్‌పై విచారణ పూర్తికా వడంతో శాఖపరమైన చర్యలు తీసుకునేందుకు కలెక్టర్‌కు నివేదిక అందించినట్లు విద్యాశాఖ వర్గాల సమాచారం.

పేదవాడి ఆకలి తీర్చడమే లక్ష్యం

● రూ.5కే రుచికరమైన భోజనం: మంత్రి గుమ్మిడి సంధ్యారాణి



సాలూరు రూరల్: ఫీల్డ్‌అసిస్టెంట్లకు నియామాక పత్రాలందిస్తున్న సంధ్యారాణి

సాలూరు: పేదవాడి ఆకలి తీర్చడమే అన్న క్యాంటీన్ల ప్రధాన ఉద్దేశమని రాష్ట్ర గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. స్థానిక తహసీల్దారు కార్యాలయ ఆవరణలో రూ.60 లక్షలతో నిర్మించనున్న అన్న క్యాంటీన్ భవన నిర్మాణానికి బుధవారం భూమి పూజ చేశారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్రంలో అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వీటి నిర్వహణకు ఎవరైనా విరాళాలు అందజేయవచ్చునని అన్నారు. తన వంతు సాయంగా రూ.5 లక్షలు విరాళంగా ప్రకటించారు. మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ కేతిరెడ్డి చంద్రశేఖర్ రూ.లక్ష, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు రూ.20 వేలు, తోణాం గ్రామానికి చెందిన రొంపల్లి రజనీ రూ.పది వేలు విరాళంగా ప్రకటించారు. మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్‌దేవ్ మాట్లాడుతూ ఎన్టీఆర్ ఆశయం పేదల ఆకలి తీర్చేమేనని అన్నారు. సాలూరుజమీందార్ విక్రమచంద్రసన్యాసిరాజు మాట్లాడుతూ తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోని స్థలం కోర్టులో ఉందని ఓ రౌడీషీటర్ తప్పుడు ప్రచారం చేస్తున్నాడని అన్నారు. అందరి సమక్షంలో ఈ స్థలాన్ని ప్రభుత్వానికి రాసి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ పి.ప్రసన్నవాణి పాల్గొన్నారు.

గిరిజనులకు ఉపాధి ఫలాలు అందాలి

సాలూరు రూరల్: ఉపాధి హామీ పథకం ఫలాలు గిరిజనులకు అందాలని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. నాలుగేళ్లుగా ఖాళీగా ఉన్న సంపం గిపాడు, కొఠియా గ్రూప్ గంజాయిభద్ర పంచాయతీలకు క్షేత్రస హాయకుల నియామాక పత్రాలను వంతల సీతారాం,రాజేష్‌లకు బుధవారం ఆమె అందించారు. ఈ సందర్భంగా ఆయా పంచాయతీ ఉపాధి పనుల వివరాలను ఎంపీడీవో గొల్లపల్లి పార్వతి, ఏపీవో రామకృష్ణ ఆమెకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు ఆముదాల పరమేశు పాల్గొన్నారు.

కార్యకర్తల కుటుంబాలకు పార్టీ భరోసా

టీడీపీ కార్యకర్తల కుటుంబాలకు పార్టీ భరోసాగా ఉంటుందని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు.జీగిరాంలో ఇటీవల మరణించి టీడీపీ మాజీ సర్పంచ్ పెదిరెడ్ల అప్పారావు కుటుంబాన్ని బుధవారం ఆమె పరామర్శించారు. .

కుడ్డపల్లిలో పొలంబడి



గిరిజన రైతులకు కంది విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏడీఏ

సీతంపేట రూరల్: కుడ్డపల్లి పంచాయతీలో బుధవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ రత్నకుమారి గిరిజన రైతులకు నూతన వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. కంది విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖాధికారి పి.శ్రీదేవి, వీఏఏ లావణ్య పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద సృష్టించాలి: ఎమ్మెల్యే

పార్వతీపురం రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో చెత్త సేకరణ నుంచి సంపద సృష్టించే కార్యక్రమాలు నిర్వహించాలని, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర కోరారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచ్‌లు, కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ ఒందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం చం ద్రబాబునాయుడు, ఉపముఖ్యమం త్రి పవన్‌కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా పంచాయతీలో అభివృద్ధి జరగాలన్నారు. కార్య క్రమంలో ఎంపీపీ శోభారాణి, ఎంపీడీవో మహ్మద్ అఖిల్‌జావెద్, టీడీపీ మండలాధ్యక్షుడు చం ద్రమౌళి, ప్రధాన కార్యదర్శి జాగాన చం ద్రమౌళి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సర్దుబాటుపై వీడియోకాన్ఫరెన్స్

సాలూరు రూరల్: ఉపాధ్యాయుల పనిసర్దుబాటు కార్యక్రమం సజావుగా నిర్వహణకు బుధవారం ఆర్జేడీ విజయభాస్కరరావు డీఈవోలు,ఎంఈవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పని సర్దుబాటు కౌన్సెలింగ్ ఈ నెల 17కు వాయిదా వేసిన తరుణంలో ఏ విధంగా నిర్వహించాలో ఆయన మార్గనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా నిబంధనలను వివరించారు. మండల స్థాయిలో కౌన్సెలింగ్ సందర్భంగా ఎంఈవోలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర వాటిపై పలు సూచనలు చేశారు. పలు మండలాల ఎంఈవోలు వ్యక్తం చేసిన సందేహాలను నివృత్తి చేశారు.

ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి: పీవో



సీతంపేట రూరల్: వంటశాలను పరిశీలిస్తున్న పీవో రాహుల్‌కుమార్ రెడ్డి

సీతంపేట రూరల్: బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని విద్యార్థినులకు ఐటీడీఏ పీవో టి రాహుల్‌కుమార్ రెడ్డి సూచించారు. బుధవారం సీతంపేట గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మెనూ అమలు, విద్యార్థినుల విద్యా ప్రమాణాల సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్య క్రమంలో డీడీ అన్నదొర, డిప్యూటి డీఈవో పి.నారాయుడు, ఏఎంవో కోటిబాబు,హెచ్ఎం పద్మజ,హెచ్‌డబ్ల్యుఓ అమల పాల్గొన్నారు.

ఐటీడీఏ పీవోకు ఘనంగా వీడ్కోలు

సీతంపేట: సీతంపేట ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రాహుల్‌కుమార్‌రెడ్డి బదిలీపై వెళుతున్న సంగతి తెలిసిందే. ఆయనకు ఉద్యోగులు బుధవారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో ఏపీవో చిన్నబాబు, ఉద్యానవనాల ప్రాజెక్టు అధికారి వెంకట గణేష్, డీడీ అన్నదొర, వివిధ శాఖలఅధికారులు పాల్గొన్నారు.

సాలూరు ఎంపీడీవోకు..

సాలూరు రూరల్: ఎన్నికల సమయంలో వచ్చి ప్రభుత్వ ఆదేశాలతో సొంత జిల్లా శ్రీకాకుళం కోటబొమ్మాళికి బదిలీపై వెళ్తున్న సాలూరు ఎంపీడీవో కె.ఫణింద్రకు ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది మంగళవారం రాత్రి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయనకు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో పార్వతి,సిబ్బంది పొట్ట రమణమూర్తి పాల్గొన్నారు.

తలవరంలో విగ్రహాల ఏర్పాటు



కలాం విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

వీరఘట్టం: మండలంలోని తలవరం జడ్పీ ఉన్నత పాఠశాల 1999 సంవత్సరం పదో తరగతి విద్యార్థులు పాఠశాలలో ఏపీజే అబ్దుల్‌కలాం, మహాత్మాగాంధీ, సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహాలను ఏర్పాటుచేశారు. ఈ మేరకు బుధవారం పాఠశాల ఆవరణలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో హెచ్ఎం వై.జగన్ మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు మరింత మందికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారన్నారు.

పూడికలు తీశారు.. రోడ్డుపై వదిలేశారు

● కందులపథం గ్రామస్థుల అవస్థలు



కాలువ నుంచి తీసి రోడ్డుపై పూడిక విడిచిపెట్టిన దృశ్యం

సాలూరు రూరల్: మండలంలోని కందులపథంలో కాలువల్లో పూడికలు తీసి రోడ్డుపైనే వదిలేశారు. ఆరు రోజుల కిందట కాలువల్లో పూడికలు తీశారు. దీంతో కాలువల్లో మురుగునీరు సజావుగా ప్రవహిస్తుందని గ్రామస్థులు ఆనందపడ్డారు. అయితే పూడికలను తరలించకుండా అలాగే వదిలేయడంతో గ్రామస్థులు అవస్థలుపడుతున్నారు. తరచూ వర్షాలు కురుస్తుండడంతో మురుగు రోడ్డుపైకి రావడంతో అధ్వానంగా మారుతోందని గ్రామస్థులు వాపోతున్నారు. అయితే వర్షం నీటితో కాలువల్లో తీసిన పూడిక మళ్లీ కాలువల్లోకి చేరుతోంది. సత్వరమే తీసిన పూడికలను తరలించాలని పలువురు కోరుతున్నారు. కాగా పూడికలు తీసి తరలించడానికి కార్మికులతో ఒప్పందం చేసుకున్నామని పంచాయతీ కార్యదర్శి గణపతి తెలిపారు.వారు పూడికలు తీసి తరలించడానికి జాప్యం చేస్తున్నారని తెలిపారు. సత్వరమే తరలించడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.


ఎంపీడీవోగా పైడితల్లి

గరుగుబిల్లి: స్థానిక ఎంపీడీవోగా జి.పైడితల్లి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఎంపీడీవోగా పనిచేసిన ఆమె శ్రీకాకుళం జిల్లాకు బదిలీపై వెళ్లిన విషయం విదితమే. ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లిన ఎంపీడీవోలు తిరిగి సొంత జిల్లాలకు వెళ్లేందుకు వీలుగా జీవో విడు దల చేయడంతో గతంలో ఎంపీడీవోగా పనిచేసిన పైడి తల్లి బాధ్యతలు చేపట్టారు. కాగా సిబ్బంది పైడితిల్లికి అభినందించారు.

స్వాతంత్ర్య సమరంలో బొబ్బిలి వీరులు

స్వాతంత్ర్య ఉద్యమంలో బొబ్బిలి వీరులు కీలక పాత్ర పోషించారు. దశల వారీగా జరిగిన నిరసనల్లో పాల్గొని బ్రిటీష్ వారిపై అలుపెరుగని పోరాటం చేశారు. ఆ క్రమంలో లాఠీదెబ్బలు తిన్నారు. జైలు జీవితం అనుభవించారు. ఆ మహానుభావుల్లో బొబ్బిలి ఆఖరి సంస్థానాధీశులు రాజా ఆర్‌ఎస్‌ఆర్‌కె రంగారావుది(బొబ్బిలి రాజా) మ హోన్నతమైన ప్రస్థానం. సంస్థానం పాఠశాలను స్థాపించి దేశానికి విద్యావంతులను అందించారు. లండన్‌లో జరిగిన రెండో రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్నారు. బొబ్బిలి గాంధీగా పేరొందిన అయ్యగారి నారాయణమూర్తి గాంధీజీకి అడ్డుగా నిలిచి లాఠీదెబ్బలు తిన్నారు. బొబ్బిలి పట్టణానికే చెందిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఎమ్మెల్యే గోనా సీతారామస్వామి సహాయనిరాకరణ ఉద్యమంలో గాంధీజీతో కలిసి అడుగులు వేశారు.

ఉద్యమ కాలం నాటి సంస్థానం పాఠశాల



బొబ్బిలి, ఆగస్టు 14: బొబ్బిలి పట్టణంలో బ్రిటీషు పరిపాలనా కాలంలో 1864లో మద్రాసు ఉమ్మడి రాష్ట్రాల సీఎంగా పనిచేసిన స్థానిక ఆఖరి సంస్థానాధీశులు రాజా ఆర్‌ఎస్‌ఆర్‌కె రంగారావు బాలబాలికల కోసం పాఠశాలను ఏర్పాటు చేశారు. సంస్థానం మిడిల్ స్కూల్‌గా ఏర్పాటైన ఈ పాఠశాల ఉన్నత పాఠశాలగా 1882లో అప్‌గ్రేడ్ అయింది. 'యు' ఆకారంలో భవనాలతో విశాలమైదానంతో పాఠశాలను తీర్చిదిద్దారు. 1908లో మరిన్ని హంగులు సమకూర్చారు. క్రమశిక్షణ, నాణ్యమైన విద్యకు పెట్టింది పేరుగా జాతీయస్థాయిలో ఈ స్కూలు గుర్తింపు పొందింది. త్రివిధ దళాల అధిపతిగా పనిచేసిన జనరల్ కేవీ కృష్ణారావు ఇక్కడ విద్యార్థే. హెచ్‌ఎం కార్యాలయం నుంచి అన్ని తరగత గదులకు సమాచారం అందించేలా బ్రిటీషు కాలంలోనే రేడియోను ఏర్పాటు చేశారు. అత్యున్నతమైన లైబ్రరీని స్థాపించారు.

● పాఠశాల వ్యవస్థాపకులైన రాజా ఆర్‌ఎస్‌ఆర్‌కె రంగారావు స్వతహాగా పోలో క్రీడాకారుడు కావడంతో విశాలమైదానాన్ని సమకూర్చి అందరినీ విశేషంగా ప్రోత్సహించారు. ఆటల్లో జాతీయస్థాయిలో నాటి యువత రాణించేవారు.

దేవాలయంగా భావించేవారు

గోనా అప్పారావు, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు, బొబ్బిలి

బొబ్బిలి రాజా రంగారావు చాలా కఠినమైన క్రమశిక్షణ కలిగి ఉండేవారు. ఆయన లక్ష్యం మేరకు సంస్థానం పాఠశాలను అంతే కఠోరమైన క్రమశిక్షణతో అత్యున్నత ప్రమాణాలతో తీర్చిదిద్దారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు ఈ పాఠశాలను ఓ దేవాలయంగా భావించేవారు. అత్యుత్తమ గ్రంథాలతో కూడిన వేలాది పుస్తకాలతో ఉన్న లైబ్రరీలో జాతీయోద్యమ స్ఫూర్తిని కలిగించే పుస్తకాలు అందుబాటులో ఉండేవి.

సహాయనిరాకరణ ఉద్యమంలో సీతారామస్వామి



బొబ్బిలి, ఆగస్టు 14: బొబ్బిలి పట్టణానికి చెందిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఎమ్మెల్యే గోనా సీతారామస్వామి 1921లో మహాత్మాగాంధీతో పాటు సహాయ నిరాకరణ ఉద్యమంలో చురుగ్గా పనిచేశారు. హిందీ భాషోద్యమంలో కూడా పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీలో అనేక కీలక పదవులు నిర్వహించారు. బొబ్బిలి జమీన్ రైతు, హరిజన్, యువజన వ్యవహారాల అధ్యక్షునిగా పనిచేశారు. 1933లో గుంటూరులో బ్రిటీషు ప్రభుత్వం నిషేధించిన ఆంధ్ర పొలిటికల్ కాంగ్రెస్ సమావేశానికి, 1932 లో కోల్‌కతాలో నిషేధించిన కాంగ్రెస్ సమావేశానికి హాజరై ఆయన లాఠీచార్జీలు, జైలుశిక్ష అనుభవించారు. 1946-52లో ఉమ్మడి మద్రాసు రాష్ట్ర శాసనసభ్యునిగా పనిచేశారు.

రౌండ్ టేబుల్ సమావేశంలో బొబ్బిలి రాజా

బొబ్బిలి, ఆగస్టు 14: 1931లో లండన్‌లో జరిగిన రెండో రౌండ్‌టేబుల్ సమావేశంలో బొబ్బిలి 13వ రాజా ఆర్‌ఎస్‌ఆర్‌కె రంగారావు హాజరయ్యారు. గాంధీ నేతృత్వంలో హాజరైన భారతబృందంలో ఆయన ఒకరు. 1931-36 లో కాంపోజిట్ మద్రాసు రాష్ట్రానికి ప్రీమియర్‌గా బొబ్బిలి రాజా వ్యవహరించారు. మాజీ మంత్రి ఆర్‌వి సుజయ్‌కృష్ణరంగారావుకు ఆర్‌ఎస్‌ఆర్‌కె రంగారావు స్వయానా తాతగారు.

గాంధీకి రక్షణగా..


● లాఠీదెబ్బలు తిన్న అయ్యగారి నారాయణమూర్తి



బొబ్బిలి: స్వాతంత్ర్య ఉద్యమంలో పాలుపంచుకున్న అయ్యగారి నారాయణమూర్తి బొబ్బిలి గాంధీగా పేరు తెచ్చుకున్నారు. పట్టణంలోని చర్చివీధి సెంటరులో ఉండే నారాయణమూర్తి అసోసి యేట్ మెంబర్ ఆఫ్‌ది అమెరికన్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో డిప్లమో చదువుకున్నారు. కొన్నాళ్లపాటు సంస్థానం ఉన్నత పాఠశాలలో పనిచేసి కళాకారునిగా, వక్తగా గుర్తింపు పొందారు. కాకినాడలో జరిగిన కాంగ్రెస్ మహాసభలకు హాజరైనప్పుడు బ్రిటీషు వారు అనేక అడ్డంకులు సృష్టించినప్పటికీ కాకినాడ చేరుకోగలిగారు. సభ జరుగుతుండగా గాంధీని కొట్టి చంపేందుకు బ్రిటీషు సిపాయిలు దూసుకువస్తున్న సమయంలో నారాయణమూర్తి ఒక్క ఉదుటున ముందుకు వెళ్లి గాంధీ ఒంటిపై లాఠీదెబ్బలు పడకూడదన్న తపనతో తన రెండు చేతులు అడ్డంగా పెట్టి నిలువరించారు. లాఠీ దెబ్బలకు నారాయణమూర్తి చేతులు రెండూ చచ్చుబడిపోయాయి. అప్పటి నుంచి బొబ్బిలి గాంధీగా ఆయనను పిలిచారు.

తల్లిదండ్రుల పేరు నిలబెట్టిన తనయులు

బొబ్బిలి: అమ్మానాన్నల ప్రోద్బలంతో స్వాతంత్ర్య ఉద్యమంలోకి దుమికి బ్రిటీషు వారి దాష్టీకానికి గురైన బొబ్బిలి సోదరులు అయ్యగారి రామపాపారావు, సూర్యనారాయణరావులు పోలీసుల లాఠీదెబ్బలు, జైలు జీవితం అనుభవించారు. గాంధీ పిలుపును అందుకొని ఉప్పుసత్యాగ్రహంలో పాల్గొన్నారు. బొబ్బిలి తహసీల్దారు కార్యాలయం ఎదుట సత్యాగ్రహాన్ని ప్రారంభించిన సూర్యనారాయణ రావును అరెస్టు చేసి బళ్లారి జైలుకు తరలించారు. ఆరునెలల జైలు శిక్ష అనుభవించారు. ఆయన సోదరుడు రామపాపారావు తన స్నేహితులందరినీ వెంటపెట్టుకొని జాతీయజెండాలతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఆ క్రమంలో జైలుకు వెళ్లాల్సి వచ్చింది.



మహాత్ముడికి నిత్య పూజ

రాజాం రూరల్, ఆగస్టు 14: ఆయనో సాధారణ కూలీ.. దినసరి భత్యంతోనే కుటుంబాన్ని సాకుతున్న సగటు మనిషి.. అయితేనేం.. విపరీతమైన దేశాభిమానం.. గాంధీజీ అంటే వల్లమాలిన ప్రేమ.. తన దినచర్యలో భాగంగా ఇంటినుంచి బయటకు వెళ్తున్న ఆయన ఎండకు ఎండి, వానకు తడిసే స్థితిలో ఉన్న మహాత్ముడి విగ్రహం చూశాడు.. చలించిపోయిన ఆయన ఆ విగ్రహాన్ని అక్కడి నుంచి తరలించాడు.. కుటుంబ అవసరాల కోసం దాచుకున్న మొత్తం నుంచి కొస్త నగదును తీసి చిన్నపాటి షెల్టర్ ఏర్పాటు చేయించి అక్కడే మహాత్ముడి విగ్రహాన్ని నెలకొల్పాడు.. నిత్యం తన ఇంటి నుంచి పనిచేసే చోటుకు వెళ్తూ గాంధీ పాదాల చెంత ఓ పూవును పెట్టి దండం పెడతాడు. ఇలా మూడు నెలలు, మూడేళ్లు కాదు ఏకంగా మూడు దశాబ్దాలుగా ఈ ఆనవాయితీని కొనసాగిస్తూ అందరి మన్ననలు పొందుతున్న ఆ వ్యక్తి రాజాం పట్టణానికి చెందిన అలమలకల పైడిరాజు అలియాస్ వెంకన్న.



● **1990లో...**

గ్రామస్థాయిలో నాటకాలు ప్రదర్శించే నాటక సమాజం సభ్యులు 1990లో నాటకాన్ని ప్రదర్శించేందుకు రాజాం వచ్చారు. నాటక ప్రదర్శనలో మహాత్ముడి విగ్రహం అవసరం కావడంతో తమతో గాంధీ విగ్రహాన్ని తెచ్చిన నటులు ప్రదర్శన పూర్తయ్యాక కుమ్మరివీధిలో గ్రామదేవత సన్నిధిలో విడిచిపెట్టేశారు. ఆ విగ్రహాన్ని చూసిన వెంకన్న విగ్రహాన్ని అక్కడి నుంచి తీసుకెళ్లి సెగిడివీధిలో తాత్కాలికంగా చిన్నపాటి షెల్టర్ నిర్మించి అక్కడ విగ్రహాన్ని పెట్టి నిత్యపూజలు చేయడం ప్రారంభించాడు.

ఢిల్లీ వేడుకల్లో జిల్లా సర్పంచ్‌లు..

చీపురుపల్లి, ఆగస్టు 14: దేశ రాజధాని ఢిల్లీలో జరగనున్న స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు జిల్లా నుంచి ఐదుగురు సర్పంచ్‌లు హాజరవుతున్నారు. విజయనగరం మండలంలోని ద్వారపూడి, చెల్లూరు, చీపురుపల్లి నుంచి రావివలస, పుర్రేయవలస, రాజాం నుంచి ఒమ్మి గ్రామ సర్పంచ్‌లు ఈ వేడుకలకు ఎంపికైనట్టు సమాచారం అందింది. ఆయా పంచాయతీల్లో కేంద్ర ప్రభుత్వ పథకాలు అమలు చేయడంలో మెరుగైన పనితీరును కనబరిచినట్టు కేంద్ర ప్రభుత్వ అధికారులు తమ ఆహ్వానంలో పేర్కొన్నారు. కాగా సమాచారం అందుకున్న రావివలస, పుర్రేయవలస సర్పంచ్‌లు పనస జానకి రామమణికంఠ, సారిక మోహనరావులు ఇప్పటికే ఢిల్లీకి చేరుకున్నారు.



ఢిల్లీలోని పాత పార్లమెంట్ భవనం వద్ద జిల్లా సర్పంచ్‌లు

నిందితులను కఠినంగా శిక్షించాలి

విజయనగరం రింగురోడ్డు: పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో వైద్యురాలిపై హత్యచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టరు జేసీ నాయుడు డిమాండ్ చేశారు. బుధవారం కంటోన్మెంట్‌లోని మృతురాలికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు వైద్యం అందించే వైద్యులపైన దాడులు చేయడం హత్యలు చేయడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఐఎంఏ పూర్వ అధ్యక్షుడు వీఎస్ ప్రసాద్, ప్రతి నిధులు అశోక్, మహేంద్రగిరి, లంకా శ్రీనివాసరావు, త్రినాథ్‌రావు, ఎం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'ఉచిత బస్సువల్ల ఉపాధి కోల్పోతాం'

విజయనగరం దాసన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టబోతున్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై పునరాలోచన చేయాలని విజయదుర్గా ఆటో వర్కర్స్ యూనియన్(ఏఐఎఫ్‌టీయూ) అనుబంధ సంస్థ జిల్లా అధ్యక్షుడు నీలాపు అప్పలరాజు రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్రంలో సుమారు 5 లక్షల పైచిలుకు ఆటో డ్రైవర్లు ఉపాధి పొందుతున్నారని, ఉచిత బస్సు వల్ల ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందన్నారు.

రేషన్ డీలర్ల బకాయిలు వెంటనే చెల్లించాలి

రాజాం రూరల్: అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన పథకాలకు సంబంధించిన కమిషన్ బకాయిలను వెంటనే చెల్లించేలా ఉత్తర్వులు జారీ చేయాలని రేషన్ డీలర్ల సంఘ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఉమాగౌరి ఓ ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో తీసుకున్న నిర్ణయాలు రేషన్ డీలర్ల జీవనానికి ఊరట కలిగించే విధంగా ఉన్నాయని పేర్కొన్నారు.

పాఠశాల గ్రంథాలయానికి పుస్తకాలు

సంతకవిటి: బొద్దూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గ్రంథాలయానికి మందరాడకు చెందిన ఎస్‌ఆర్‌ఐ లెంక జగన్, ఎస్‌జీటీ పొట్టి రామకృష్ణ, కృష్ణారావు, చక్రి తదితరులు ఇంగ్లీషు, తెలుగు పుస్తకాలు అందజేశారు. వీటిని హెచ్‌ఎం మల్లేశ్వరరావు, ఉపాధ్యాయుడు దామోదరరావు, పాఠశాల చైర్మన్‌లకు అందజేశారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

సంతకవిటి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు బుధవారం బ్యాగులు పంపిణీ చేశారు. ఎం.పి. కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ వీటిని అందజేశారు. విద్యార్థులు ప్రయోజకులై, తల్లిదండ్రులకు గుర్తింపు తీసుకురావాలని సూచించారు. కొల్ల అప్పలనాయుడు, గట్టి భాను, రఘు బాబు, గణేష్ తదితరురలు పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో ఉంగరాడమెట్ట ప్రథమం

రేగిడి: స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా మండల విద్యాశాఖ నిర్వహించిన క్విజ్ పోటీల్లో ఉంగరాడమెట్ట గురకుల పాఠశాల ప్రథమ, దేవుదళ కేజీబీవీ ద్వితీయ స్థానంలో నిలిచినట్లు ఎంఈఓలు వరప్రసాదరావు, ఎరకయ్యలు తెలిపారు. ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించినట్టు చెప్పారు.

సోలార్ దీపాలు ఏర్పాటుకు సిద్ధం

లక్కవరపుకోట: మండలంలోని మల్లివీడు, కొత్తపాలెం గ్రామాల్లో సోలార్ దీపాల ఏర్పాటుకు బల్లారికి చెందిన పీఎస్‌ఆర్ స్టీల్ అండ్ పవర్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ డైరెక్టర్ జోని సన్యాసిరావు ముందుకొచ్చారు. ఇందుకు సంబంధించిన వివరాలను స్థానిక ఎమ్మెల్యే లలితకుమారికి, జిల్లా కలెక్టర్ దృష్టిలో పెట్టినట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఏదైనా గ్రా మాలకు దీపాలు కావాలంటే ప్రభుత్వ సబ్సిడీ పోను మిగ తా సొమ్మును తాను భరిస్తానని చెప్పారు. సన్ని స్వగ్రామం మల్లివీడు కావడంతో మొదటి ప్రాధాన్యం ఇచ్చినట్టు తెలిపారు.

స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహావిష్కరణ

సంతకవిటి: తాలాడ గ్రామంలో నిర్మించిన స్వాతంత్ర్య సమరయోధులు సర్దార్ గౌతు లచ్చన్న, ముగ్గు జగన్నాథంనాయుడుల విగ్రహాలను బుధవారం రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష, విజయనగరం ఎం.పి. కలిశెట్టి అప్పలనాయుడు ఆవిష్కరించారు. ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ లచ్చన్న కృషి ఫలితంగానే నేడు స్థానిక సంస్థల్లో అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం లభిస్తోందని అభిప్రాయపడ్డారు. ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ మాట్లాడుతూ గౌతు లచ్చన్న దళితులకు దేవాలయాలలో ప్రవేశాలు కల్పించారని కొనియాడారు. ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో ఇచ్ఛాపురం నుంచి మద్రాసు వరకు పాదయాత్ర చేసిన నాయకుడు గౌతు లచ్చన్న అని తెలిపారు. ఈ కార్యక్రమంలో తూర్పు కాపు మాజీ చైర్మన్ కొల్ల అప్పలనాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు గట్టి భాను, వల్లూరు గణేష్, పిన్నింటి మోహన్‌రావు, కిమిడి అశోక్‌బాబు, దూబ ధర్మారావు, ముగ్గు రామారావు, గురవాన నారాయణరావు, లచ్చుభుక్త కృష్ణమూర్తి, మొయ్యి నారాయణప్పడు, గరుగుబిల్లి రాణాప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.



గౌతు లచ్చన్న విగ్రహావిష్కరణలో కోండ్రు, గౌతు శిరీష, ఎంపీ కలిశెట్టి

పాఠశాలలను సందర్శించిన న్యాయాధికారి

కొత్తవలస, ఆగస్టు 14: కొత్తవలస జూనియర్ సివిల్ జడ్జి డాక్టర్ సముద్రాల విజయచందర్ బుధవారం మండలంలోని తుమ్మికాపల్లి పంచాయతీ పరిధిలోని కస్తూర్బా పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులకు సంబంధించిన మౌలిక వసతులు ఉన్నాయా? లేదా? అనే విషయాలపై ఆరా తీశారు. పాఠశాలలో కొంతవరకు పారిశుద్యలోపం ఉన్నట్టు గుర్తించారు. విద్యార్థులందరికీ పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు వంటివి అందాయా? లేదా? ఇంకాఏమైనా పుస్తకాల కొరత ఉందా? సరిపడినంత మంది ఉపాధ్యాయులా? ఉన్నారా? అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. న్యాయమూర్తితో పాటు కోర్టు సిబ్బంది, న్యాయవాద సంఘం ప్రతినిధులు డీ.శ్రీనివాస్, జీవీ రమణ, గవరకృష్ణ పాల్గొన్నారు. ● **వేపాడ:** మండలంలోని వేపాడ బక్కునాయుడుపేట వద్ద గల కస్తూర్బా బాలిక పాఠశాలను బుధవారం కొత్తవలస కోర్టు సివిల్ న్యాయాధికారి డాక్టర్.సముద్రాల విజయచందర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులతో ఆయన మాట్లాడారు. అనంతరం స్టోర్ రూమ్‌లో తి ను బండారాలను పరిశీలించి ప్రభుత్వం సరఫరా చేస్తున్న ప్రతి వస్తువు తాజాగా ఉందో లేదో ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నా రు. మెరుగైన ఫలితాలు సాధనకు కృషి చేయాలని పాఠశాల ప్రిన్సిపాల్ కిర ణ్మయికి, సిబ్బంది సూ చించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడిన జడ్జి రాష్ట్ర హైకోర్టు ఆదే శాల మేరకు పాఠశాలలను తనిఖీ చేస్తున్నట్టు తెలిపారు. కోర్టు సిబ్బంది, న్యాయ వాదులు డి. శ్రీనువాసరావు, న్యాయవాదుల సంఘం కార్యదర్శి జీవీ రమణ, కోశాధికారి జి.కృష్ణమూర్తి, జాయింట్ సెక్రటరీ తదితరులు పాల్గొన్నారు.



వేపాడ: విద్యార్థినులతో మాట్లాడుతున్న విజయచందర్

నైతిక విలువలతో కూడిన విద్యను అభ్యసించాలి

విజయనగరం దాసన్నపేట: విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన విద్యను అందించాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు అన్నారు. బుధవారం పూల్‌బాగ్‌లోని ఏపీ మోడల్ స్కూల్‌ను సందర్శించారు. అన్ని తరగతి గదులను, వంట గదులను పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. పాఠశాల కమిటీ చైర్మన్ జయరాజ్, ప్రిన్సిపాల్ బేగం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సర్దుబాటుతో విద్యార్థులకు నష్టం

కొత్తవలస: పాఠశాలలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల సర్దుబాటు కారణంగా 3 నుంచి 8 వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు నష్టం జరుగుతుందని యూటీఎఫ్ ఉపాధ్యాయ సంగం ప్రతినిధులు సీహెచ్ నిర్మలా దేవి, జి.విజయగౌరి ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. దీని వల్ల ప్రాథమికోన్నత పాఠశాలలో సబ్జెక్టు ఉపాధ్యాయులు లేక విద్యార్థులకు అన్యాయం జరుగుతుందన్నారు.

తాగునీటి సరఫరా నిలిపివేత

రేగిడి: సంకిలి నాగావళి రక్షిత పైప్‌లైన్లు ఉంగరాడమెట్ట పెట్రోల్ బంక్ సమీపంలో పూర్తిగా పాడయ్యాయి. దీంతో ఈ రక్షితసోర్స్ పరిధిలో ఉన్న స్కీమ్‌వాటర్‌ను రెండు రోజులుగా నిలిపివేసినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది తెలిపారు. ఈ కారణంగా మండలంలోని 40 గ్రామాల్లో తాగునీటి సమస్య వేధిస్తోంది. సంకిలి, చిన్నయ్యపేట, దేవుదళ, అప్పాపురం తదితర గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఏఈ శ్రీచరణ్ ఆధ్వర్యంలో ఈ పైప్‌లైన్ మార్చే చర్యలు చేపట్టారు. బుధవారం ఏదో సమయానికి నీటి సరఫరా చేస్తామని ఏఈ వెల్లడించారు.

విద్యార్థులకు అభినందన

జామి: కుమరాం కేజీబీవీ ప్రతిష్టను ఉపాధ్యాయులు పెంచారని జిల్లా పౌర వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. నూజివీడు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో సీట్లు సాధించిన ఈ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులను బుధవారం అభినందించారు. ప్రిన్సిపాల్ బలగ జ్యోతి, పౌర వేదిక కార్యదర్శి రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

విధులపై సర్పంచ్‌లకు అవగాహన ఉండాలి

జామి: పంచాయతీ విధులపై పూర్తి అవగా హన ఉండాలని పంచా యతీరాజ్ సహాయ కమి షనర్ కృష్ణ మోహన్‌సూచించారు. జామి మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, కార్యదర్శుల శిక్షణ తరగతులను బుధవారం ఆయన పరిశీలించారు. పంచాయితీ నిధులు, అభివృద్ధికి సంబంధించిన అంశాలను సర్పంచులు, కార్యదర్శులు తెలుసుకోవాలన్నారు. ● **వేపాడ:** మండల పరిషత్ సమావేశ భవనంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న సర్పంచ్‌ల శిక్షణ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఉమ తదితరులు పాల్గొన్నారు. ● **కొత్తవలస:** మండలానికి చెందిన సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు 3 రోజులపాటు స్థానిక ఎంపీడీవో కార్యాయంలో నిర్వహించిన శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమం బుధవారం జరిగింది. రాష్ట్ర కమిషనర్ కృష్ణమోహన్ హాజరయ్యారు. ఏ గ్రామ పంచాయతీ అయినా అభివృద్ధి జరగాలంటే గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి సమన్వయతో కలసి పనిచేయాలన్నారు. ● **బొబ్బిలి:** బొబ్బిలి మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మూడో రోజు సర్పంచ్‌లు, కార్యదర్శుల శిక్షణ కార్యక్రమం జరిగింది. ఎంపీడీఓ రవి కుమార్ ఆధ్వర్యంలో వీధి దీపాల ఏర్పాటు, నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీ రాజ్ డైరెక్టర్ నాగ రాజు శిక్షణ తరగతులను వీక్షించి సభ్యులతో మాట్లాడారు. ● **రామభద్రపురం:** మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ తరగతులు బుధవారం ముగిశాయి. ఈ కార్యక్రమానికి సర్పంచులు డుమ్మా కొట్టారు. 22 గ్రామ పంచాయతీలకు గాను ఒక్క సర్పంచ్ కూడా శిక్షణకు హాజరుకాకపోవడం విశేషం. పంచాయతీలలో వివిధ అభివృద్ధి పనులు, సర్పంచ్‌ల బాధ్యతలు తదితర అంశాలపై అవగాహన కల్పించాలని ప్రభుత్వం ఈ శిక్షణ నిర్వహించింది. దీనిపై మండల అధికారులను వివరణ కోరేందుకు ప్రయత్నించగా, అందుబాటులో లేరు.



సూచనలు చేస్తున్న కమిషనర్ కృష్ణమోహన్

సహారా బాధితుల నిరసన

ఖాతాదారుల డిపాజిట్ డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సహారా ఉద్యోగులు, బాధితులు బుధవారం జిల్లా వ్యాప్తంగా నిరసన ర్యాలీ చేశారు. మానవహారం నిర్వహించారు.



బొబ్బిలిలో..



రాజాంలో..

ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సేవలు

● ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

విజయనగరం రూరల్/ రింగురోడ్డు, ఆగస్టు 14: ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు ఆర్టీసీ సిబ్బంది కృషి చేయాలని విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు చెప్పా రు. విజయనగరం నుంచి విజయవాడ సూపర్ డీలక్స్, విజయనగరం నుంచి విశాఖపట్టణం ఎక్స్‌ప్రెస్ రెండు కొత్త బస్సులను ఆమె బుధవారం విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రారంభించారు. బస్సును పరిశీలించి కాసేపు కూర్చున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు, సంబంధిత శాఖ మంత్రి రామప్రసాద్‌రెడ్డి తదిత రులు ఆర్టీసీలో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారన్నారు. కూటమి ప్ర భుత్వం వచ్చిన తరువాత కొత్త ఆర్టీసీ బస్సులను అన్ని డిపోలకు పంపుతు న్నార న్నారు. రానున్న రెండు నెలల కాలంలో మరిన్ని ఆర్టీసీ బస్సులు విజయనగరా నికి వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజరు శ్రీనివాస రావు, సిబ్బంది పాల్గొన్నారు.



బస్సును ప్రారంభిస్తున్న అదితి

కొట్టక్కి వద్ద 20 కిలోల గంజాయి పట్టివేత

● గోప్యంగా ఉంచిన పోలీసులు

రామభద్రపురం: మండల పరిధిలోని కొట్టక్కి జాతీయ రహదారి వద్ద బైకుతో గంజాయిని అక్రమ రవాణా చేస్తున్న ఒక వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకొని అతని నుంచి సుమారు 20 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది. ఒడిషా రాష్ట్రానికి చెందిన ఒక వ్యక్తి ద్విచక్రవాహనంపై ఈ గంజాయిని విజయనగరం వైపు తీసుకువెళుతుండగా అతనిని పోలీసులు పట్టుకున్నారు. అయితే ఈ గంజాయిని ఎక్కడ నుంచి తెస్తున్నదీ..? ఎవరికి విక్రయించడానికి అన్న వివరాలు ఇవ్వడానికి పోలీసులు నిరాకరించారు. సమాచారం అంతా గోప్యంగా ఉంచారు. పోలీసుల అదుపులో ఉన్న నిందితుడిని బుధవారం ఉదయం నుంచి ప్రశ్నిస్తున్నప్పటికీ ఒడిశా భాష అర్థంకాక పోలీసులు మల్లగుల్లాలు పడుతున్నట్టు సమాచారం.

ఆక్రమణలను నిరోధించకపోతే ఆందోళన

రామభద్రపురం: మండల కేంద్రంలో ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని జనసేన బొబ్బిలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ గిరడ అప్పలస్వామి ఆరోపించారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అనంతరం మండల రెవెన్యూ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు.